క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లికి సత్కారం



తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని సోమవారం పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఉదయగిరి రమేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

స్వప్నకు డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా వర్సిటీ అప్లయిడ్ మైక్రోబయాలజీ విభాగపు పరిశోధక విద్యార్థిని పి.స్వప్నకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె ప్రొఫెసర్ వీవీ లక్ష్మి పర్యవేక్షణలో మైక్రోబియల్ బయోడిగ్రేడేషన్ ఆఫ్ ఫ్లవర్ వేస్ట్ అనే అంశంపై పరిశోధన చేశారు.

నారా లోకేష్ దిష్టిబొమ్మ దహనం

తిరుపతి ఎడ్యుకేషన్ : వార్డు సభ్యుడిగా కూడా గెలవని లోకేష్‌కు తిరుపతి నగరం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని వైఎస్సార్ విద్యార్థి విభాగం నేతలు తెలిపారు. వారు సోమవారం ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద నారా లోకేష్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఆ సంఘం వర్సిటీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తిరుపతిలో పలు కనెక్టివిటీ రోడ్లను నిర్మించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపుతున్న ఘనత భూమన అభినయ్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ముని, నరేష్, రాకేష్, గౌతమ్, చందు, సుధీర్, రాజేష్, కోవిద్, సాహిత్, పవన్ పాల్గొన్నారు.



లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి నేతలు

భూమనను విమర్శించే అర్హత లోకేష్‌కు లేదు

తిరుపతి మంగళం : ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని విమర్శించే అర్హత లోకేష్‌కు లేదని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు తమ్ముడు గణేష్, కోటేశ్వరమ్మ, తలారి రాజేంద్ర తెలిపారు. వారు సోమవారం జీవకోనలో లోకేష్ ఫ్లెక్సీలను దహనం చేశారు. వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రకు ప్రజాదరణ లేకపోవడంతో లోకేష్ వైఎస్సార్ సీపీ నేతలను విమర్శించి పబ్లిసిటీ చేసుకోవాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. ప్రజాసంక్షేమం, నగర అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి పనిచేస్తున్నారని, వారిని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రమణమ్మ, పుష్పాచౌదరి, శారద, సురేంద్రరెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, సోము, రెడ్డెప్పరెడ్డి, రమణ, కోటి, బాలకృష్ణ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



లోకేష్ ఫ్లెక్సీలను దహనం చేస్తున్న కార్పొరేటర్లు, నేతలు

ఘనంగా గంధం ఊరేగింపు

పాకాల : స్థానిక పకీరు పేటలో ఉన్న షేక్ హజరత్ మహబూబ్ సుబహాని దర్గా ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గంధోత్సవాన్ని చేపట్టారు. ఇందులో తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గంధాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలో సమర్పించారు. ఉత్సవం నిర్వహణకు రూ.50 వేల విరాళం ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, ఎంపీపీ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



గంధం తీసుకొస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ఉచిత దంత వైద్య శిబిరం

తిరుపతి ఎడ్యుకేషన్ : రుయా ఆస్పత్రి దంత వైద్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఎస్వీ హైస్కూల్లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎన్.స్వప్నప్రియ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది 504 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. డాక్టర్ స్వప్నప్రియ మాట్లాడుతూ ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించాలనుకునే వారు www.svrrgghdental@gmail.com పాఠశాల వివరాలు, ప్రధానోపాధ్యాయుల మొబైల్ నంబరుతో మెయిల్ పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సోనియా, స్రవంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబు మెప్పు కోసమే సప్తగిరి ప్రసాద్ విమర్శలు

తిరుపతి కల్చరల్: చంద్రబాబు, లోకేష్ మెప్పుకోసమే స్థానికేతరుడైన సప్తగిరిప్రసాద్ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలారి రాజేంద్ర, జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు తెలిపారు. వారు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు దళితులను కించపరిచినప్పుడు సప్తగిరిప్రసాద్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘం ముసుగులో వసూళ్లకు పాల్పడుతూ పబ్బం గడుపుతున్నాడని ఆరోపించారు. తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధి చూసి మాట్లాడాలని హితవుపలికారు. నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషిచేస్తున్న ఎమ్మెల్యే భూమనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నాగయ్య, వంశీ, రాజశేఖర్, కృష్ణవేణి, ఎస్.కుమార్, ఎన్.వెంకటరమణ, మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తలారి రాజేంద్ర

గాయపడిన వ్యక్తి మృతి

రామచంద్రాపురం: వెదురుకుప్పం మండలం కమ్మకండ్రిగలో అంత్యక్రియలకు వెళుతూ ఈ నెల 22న వ్యాన్ బోల్తాపడి గాయపడిన వ్యక్తి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. రామచంద్రాపురం మండలం అనుప్పల్లికి చెందిన వారు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వ్యాన్‌లో బయలుదేరారు. వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లి వద్ద వ్యాన్ బోల్తా పడి 27 మంది గాయపడ్డారు. వారిలో రూప్‌సుందర్ (47) పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైకి, అక్కడి నుంచి తిరిగి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రూప్‌సుందర్ (ఫైల్)

బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

తిరుపతి అర్బన్: సత్యసాయి జిల్లా కదిరిలోని ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆలయ ఈవో గురుప్రసాద్ జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని కోరారు. ఆయన సోమవారం కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. మార్చి 2 నుంచి 16 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో గురుప్రసాద్